క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి

కడప కార్పొరేషన్: తిరుమల టింబర్ డిపో వ్యవస్థాపకులు కంచి వెంకట సుబ్బయ్య సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకట సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక పాతరిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన కుమారులు కె. గోపీక్రిష్ణ, సురేంద్రనాథ్, ఆదరణ నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు విజయ్‌బాబు, డి. సుబ్బరాయుడు, మాధవ్‌రెడ్డి, రవి కుమార్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

కడప ఎడ్యుకేషన్: ఒడిశా బాలసోర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడుతూ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైల్వే చరిత్రలోనే జూన్ 2వ తేదీ ఒక చీకటి దినం అన్నారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణం అన్నారు. వందే భారత్ వంటి ట్రైన్‌లను తీసుకొచ్చామని ఊదరగొట్టడం తప్పే చేసిందేమీలేదన్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖపైన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూప్‌తేజ్, చంద్రశేఖర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం స్థానిక బృంద వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించింది. బాసట నిర్వాహకులు బాలాజీరావు సోముసుబ్బన్న జ్ఞాపకార్థం వారి కుమారులు సుబ్బయ్య, పాలకొండయ్యల వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శ్రీశివకృష్ణ గోశాల, ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయం, సాయిబాబా ఆలయాల్లో ఆదివారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కాశినాయన ఆలయంలో ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం భక్తులను అలరించింది. గోశాలలో గోమాతలను అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణం, భాగవత పఠనం కార్యక్రమం చేట్టారు. భక్తులకు కాశినాయన ఆలయ దర్మకర్త పుల్లారెడ్డి, గోశాల నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా ప్రారంభమైన మహోత్సవాలు

బద్వేలు అర్బన్ : మండలంలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం గోపూజ, యాగశాల ప్రవేశం, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనము, అంకురార్పణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

కమలాపురం : విద్యార్థులు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ తదితర అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ వేయడంలో శిక్షణనిచ్చారు. అనంతరం పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో మెలకువలు నేర్పించారు

ఘనంగా గంధ మహోత్సవం



భక్తులు, పెద్దలతో కలిసి గంధం కలశాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దర్గా నిర్వాహకులు

కడప కల్చరల్: నగరంలోని రహమతుల్లా వీధిలోని ప్రఖ్యాత చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీ అమీరున్నిసా ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల విన్యాసాలు, మేళతాళాల మధ్య దర్గా వద్దకు చేర్చారు. దర్గాలోని మజార్లపై గంధాన్ని సమర్పించి, ఫాతెహా చేశారు. ఆద్యంతం భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే పలు పార్టీల నాయకులు అహ్మదుల్లా, సుభాన్ బాషా, నజీర్ అహ్మద్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖవ్వాలీ.. నేడు ఉరుసులో భాగంగా ఖవ్వాలీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బెల్గాం, గుజరాత్ నుంచి ప్రముఖ ఖవ్వాల్ తౌసిఫ్ ఖాదిరి, ఆసిఫ్ అజ్మీరి పాల్గొంటారని వివరించారు.

• కడప నగరం అల్మాస్‌పేటలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుద్దీన్ హుసేనీ చిష్తి ఉరఫ్ హజరత్ గేసుదరాజ్ బందా నవాజ్ ఉరుసులో భాగంగా ఆదివారం ఉరుసు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా గురువుల మజార్ల వద్ద సమర్పించి చాందినిని ఊరేగింపుగా తెచ్చి అలంకరించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి భక్తులందరికీ ప్రసాదాన్ని పంచి పెట్టారు. ఈ ఉత్సవానికి బయటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరై దర్గా ప్రాంగణంలోనే విశ్రమించారు. నిర్వాహకులు వారికి అదే ప్రాంగణంలో వసతి సౌకర్యాలు కల్పించారు. దర్గా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్గాప్రాంగణం రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృష్టి అవసరం



శిబిరంలో విద్య, సామాజిక అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సమీర్‌బాషా

కడప కల్చరల్: నేటితరం విద్యార్థులు శాస్త్రీయ దృష్టితో విద్య, సామాజిక అంశాలను పరిశీలించడం అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు జి.సమీర్‌బాషా అన్నారు. జిల్లాకేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో కడపలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు మ్యాజిక్ అంశాలను ప్రదర్శించి విద్యార్థులను అలరించారు. కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులకు ఆయన పలు శాస్త్రీయ అంశాలను వివరించారు. మ్యాజిక్ కేవలం హస్తలాఘవమేనని, ఇందులో ఎలాంటి అతీంద్రీయ శక్తులు లేవని, సైన్స్ మాత్రమే ఉందని వివరించారు. మ్యాజిక్ అంశాల ద్వారా మూఢ నమ్మకాలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో తార్కిక జ్ఞానం పెరుగుతుందని, బాబాల పేరుతో జనాలను మోసం చేస్తున్న విషయాల పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. విద్యార్థులంతా శాస్త్రీయ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు జీఓ నెంబర్ 1,42 అమలు చేయాలన్నారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు పీఆర్వోలను పెట్టుకొని గత సంవత్సరం డిసెంబర్ నుంచి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం నిర్బంధ విద్యను అమలు చేయాలన్నారు. డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ నాయకులు విజయ్, ఉదయ్, సునీల్ పాల్గొన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని మాచునూరు, మాచునూరు దళితవాడ, కొత్తపేట గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్ చేపట్టిన ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని కడప నగరం గడ్డిబజారు శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతి జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమశాస్త్ర పండితులు రాజేష్‌భట్టర్, ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ పూజాధికాలు నిర్వహించారు. ఇతర అర్చక బృందంతో కలిసి వారు మంత్రోచ్చాటనల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పంచద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలు, సువర్ణ ఆభరణాలతో దేవతామూర్తులను కనుల పండువగా అలంకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన భక్తులతో వారు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహింపజేశారు. ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి.గోపిబాబు, శ్రీవారి సేవకులు రామమహేష్, ఆలయ కమిటీ చైర్మన్, భజన బృందం,శ్రీవారి సేవక్ సంఘాలు కార్యక్రమంలో పాల్గొన్నాయి.

నేడు శ్రీ సత్యదేవుని కల్యాణోత్సవం

కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు శ్రీ లక్ష్మినారాయణ సుదర్శన హోమం, 9.00 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ భట్టర్ తెలిపారు. అలాగే 10.30 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీ విజయదుర్గాలయంలో పౌర్ణమి పూజలు



కలశాలతో ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఉదయం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్: కడప నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో చెన్నూరు ఆటో డ్రైవర్లకు ఎస్ఐ వెంకటయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడు రోడ్ల వద్ద ఆటోలను అడ్డంగా నిలబెట్టి వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులను కలిగించవద్దని ఎస్ఐ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనదారుల దగ్గర అన్ని రకాలైన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వాగత బోర్డును నిలబెట్టారు

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలోని చిన్నమాచుపల్లె వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వాగత బోర్డును ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే పెనుగాలులు వీచడంతో ఆ బోర్డు నేలవాలిపోయింది. దీనిపై గత నెలలో 'సాక్షి' వార్త ప్రచురించడంతో స్పందించిన అధికారులు బోర్డుకు మరమ్మతులు చేసి మళ్లీ ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పయనం



జాతీయస్థాయి పోటీలకు పయనమైన ఏపీ తైక్వాండో బాలికల జట్టు

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలోని చత్రసాల్ స్టేడియంలో నిర్వహించనున్న అండర్-19 తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ఏపీ అండర్-19 బాలికల జట్టు రైల్వేకోడూరు నుంచి పయనమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి సి. శారద మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతి తీసుకురావాలని సూచించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగే కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరుకానున్నారని పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు హాజరుకావాలన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లి జాగీర్దార్ హజరత్ సయ్యద్ షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉరుసు సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గ్వాలియర్‌కు చెందిన సలీమ్‌జంకార్ అండ్ పార్టీ బెల్గాంకు చెందిన మౌషిన్‌చిస్తిలతో గొప్ప ఖవ్వాలి పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఖురాన్ ఖ్వాని నిర్వహించారు. నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక దేవ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎకోపార్కులో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సబ్‌డీఎఫ్ఓ దివాకర్

ప్రొద్దుటూరు క్రైం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సబ్ డీఎఫ్ఓ దివాకర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ రహిత జీవనశైలికి సంబంధించిన వివిధ రకాల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని సబ్ డీఎఫ్ఓ దివాకర్ ప్రారంభించారు. స్టాల్స్‌లో జేవీవీ సమ్మర్ క్యాంప్ విద్యార్థులు, సీబీఐటీ, గౌతమి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యుత్, నీటిని ఆదా చేసే విధానం, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, తదితర నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సబ్ డీఎఫ్ఓ దివాకర్ మాట్లాడుతూ భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకృతి మానవ అభివృద్ధికి, మనుగడకు అత్యంత ఆవశ్యకమన్నారు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా వీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని సబ్ డీఎఫ్ఓ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ లక్షుమయ్య, కౌన్సిలర్ ఇర్ఫాన్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ యాలం శంకర్, సూర్యనారాయణరెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, ప్రధాన కార్యదర్శి సునీత, సమ్మర్ క్యాంప్ కో ఆర్డినేటర్స్ చరణ్, గురప్ప, అజర్, అక్షయ, ఎఫ్‌బీఓలు హరి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏకోపార్కు నుంచి ర్యాలీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు ఎకో పార్కు నుంచి ర్యాలీ చేపట్టినట్లు సబ్ డీఎఫ్ఓ దివాకర్ తెలిపారు. ఈ ర్యాలీ వాసవి సర్కిల్ వరకు కొనసాగుతుందని చెప్పారు. వాకర్లు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల



బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన భీమేశ్వరస్వామి తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేశారు.

'వేమన'కు మరింత ఉన్నతాసనం

– ఎత్తు పెంచుతున్న అధికారులు



వేమన విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఎత్తు చేస్తున్న దృశ్యం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన యోగివేమన విగ్రహానికి మరింత ఉన్నతస్థానాన్ని కల్పించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. న్యాక్ సమయంలో విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద హడావుడిగా వేమన విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే వేమన విగ్రహాన్ని తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారంటూ పలు విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు విశ్వవిద్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో వేమన విగ్రహాన్ని మరింత ఎత్తులో నిర్మించేందుకు వైవీయూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తక్కువ ఎత్తులో ఉన్న వేమన విగ్రహాన్ని తీసి పక్కన ఉంచి, ఏర్పాటు చేయనున్న ఆసనం ఎత్తు పెంపు పనులు ప్రారంభించారు. వారంరోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి మరింత స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక డిజైన్‌తో వేమన విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ట చేసేందుకు వైవీయూ అధికారులు చర్యలు చేపట్టారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి




మాట్లాడుతున్న ముత్యాలరావు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలరావు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హిందూపురం నుంచి ప్రారంభమైన జీపుజాత ఆదివారం కడప నగరానికి చేరుకుంది. ఆనంతరం నగరంలోని పాతబస్టాండులోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను హరిస్తోందని తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, సీఐటీయూ నాయకులు విజయ్ భాస్కర్, సుంకర రవి, చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కళాజాతా సభ్యులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశానుసారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కడప నగరంలో పలుచోట్ల వీధి నాటకాలు, మ్యాజిక్, హాస్య సన్నివేశాలు, ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు నీటిలో వేసినా కరగవని, భూమిలో కలవడం జరగదన్నారు. ప్లాస్టిక్‌ను కాల్చితే దాని నుంచి డయాక్సిన్లు, ప్యూరాన్ అనే విష వాయువులు వెలువడతాయన్నారు. దీనివల్ల ప్రజలకు ఊపిరితిత్తులు, శ్వాసకోస సమస్యలు, కేన్సర్ వంటివి వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులను, గుడ్డ సంచులను, కాగితపు సంచులను వాడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో కళాజాతా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. కళాజాతా బృందం సభ్యులు విభూతి భాగ్యలక్ష్మి, హరి, వేణు, నీరజ పాల్గొన్నారు.

పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలి



మాట్లాడుతున్న సీఐ ఉలసయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు తమ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థానాల్లో నిలబెట్టడానికి కృషి చేయాలని తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు. కడప నగరం బుడగజంగం కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ పాల్గొని ప్రసంగించారు. సమాజంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ బుడగ జంగాల వారు వెనకబడి ఉండడం బాధాకరన్నారు. అందుకు ప్రధాన కారణం నిరక్షరాస్యతేనని తెలిపారు. ఇప్పటినుంచి ఎవరైనా పిల్లలను చదివించకపోయినా, అర్ధరాత్రి రోడ్డు మీద ఆడపిల్లలు కనబడినా, చిన్నపిల్లలతో బిక్షాటన చేయించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు హెచ్చరించారు. లోన్‌యాప్‌ల మాయలో పడొద్దని సూచించారు. ఎస్ఐలు రామకృష్ణ, హుస్సేన్, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, మల్లయ్య పాల్గొన్నారు.